# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **బాహుబలి రాకెట్ 'ఎల్‌వీఎం3-ఎం6' బ్లూబర్డ్ బ్లాక్-2 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో.**

2. **వైద్యారోగ్య శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

3. **హస్త కళల ఉత్పత్తులు భారతదేశ సాంస్కృతిక ప్రతీకలని పేర్కొన్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

4. **అమరావతిలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని రేపు ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.**

5. **జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం**

========================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ- ఇస్రో, అమెరికాకు చెందిన AST స్పేస్‌మొబైల్ బాహుబలి రాకెట్ 'ఎల్‌వీఎం3-ఎం6' బ్లూబర్డ్ బ్లాక్-2 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఈ రోజు విజయవంతంగా ప్రయోగించింది. తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని రెండవ ప్రయోగ కేంద్రం నుండి ఉదయం 8గంటల 55 నిమిషాలకు ప్రయోగించారు. మొత్తం మూడు దశల్లో ఈ ప్రయోగం పూర్తయ్యింది. భూమి నుంచి బయల్దేరిన 15 నిమిషాల తర్వాత 'బ్లూ బర్డ్ బ్లాక్-2' ఉపగ్రహం వ్యోమనౌక నుంచి విడిపోయి 520 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలో విజయవంతంగా చేరింది. ఈ ప్రయోగం అనంతరం ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మాట్లాడుతూ, అతి తక్కువ సమయంలో రాకెట్ రూపొందించి విజయవంతంగా ప్రయోగించామని తెలుపుతూ..

వాయిస్ 28 సెకన్లు

ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ప్రయోగం విజయవంతంపై ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. ప్రపంచ వాణిజ్య ప్రయోగాల్లో భారత్ మరోసారి ప్రతిభను చాటిందని కొనియాడారు. అంతరిక్ష రంగంలో దేశం అత్యున్నత స్థానానికి ఎదుగుతూనే ఉందన్నారు. ఈ విజయం ఆత్మనిర్భర్ భారత్ ప్రయత్నాలను ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు శాఖలపై ఈ రోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో తొలుత వైద్యారోగ్య శాఖపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, ఆసుపత్రుల నిర్మాణం, వైద్య సేవల్లో నూతన సాంకేతికత వినియోగం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం స్వర్ణాంధ్ర ప్రణాళిక అమలుపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి చర్చిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

హస్త కళల ఉత్పత్తులు భారతదేశ సాంస్కృతిక ప్రతీకలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో నిర్వహిస్తున్న హస్తకళల ఎక్స్ పో ప్రదర్శనను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యంత్రాల యుగంలోనూ చేతి కళలకు ఉన్న ప్రత్యేకత, నాణ్యత, సృజనాత్మకత ఎప్పటికీ తగ్గదన్నారు. స్థానిక కళాకారులను ప్రోత్సహించి నరసాపురం లేసు అల్లికలకు మరింత ప్రాచుర్యం కల్పించనున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

పురాతన ఆయుర్వేద వైద్య విధానాన్ని ఆధునిక చికిత్స విధానంతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకున్న ఆయుర్వేద వైద్యులు స్వతంత్రంగా శస్త్ర చికిత్సలు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. భారతీయ వైద్య విధానాల కేంద్ర మండలి నియమావళి 2020 మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

సంక్రాంతి పండుగ దృష్ట్యా రాష్ట్రంలోని ఆప్కో దుకాణాల్లో చేనేత వస్త్రాలపై తగ్గింపు ధరలతో అమ్మకాలు చేపట్టనున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. మెగా క్లస్టర్ల ఏర్పాటు, గడిచిన మూడు నెలల్లో ఆప్కో అమ్మకాలపై మంత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 60, 50, 40 శాతాల డిస్కౌంట్‌లపై చేనేత వస్త్రాలను విక్రయించనున్నామని, ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. మరో రెండ్రోజుల్లో రాష్ట్రంలో ఉన్న చేనేత సహకార సంఘాల నుంచి చేనేత వస్త్రాల కొనుగోలు ప్రారంభించాలని మంత్రి సవిత ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో చేనేత ప్రదర్శనలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

---------------------------

మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రేపు అమరావతిలో ఆవిష్కరిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, వాజ్ పేయీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, ప్రజాస్వామ్య విలువలతో కూడిన, సుపరిపాలనకు ప్రతిరూపంగా వాజ్‌పేయీ నిలిచారని చెప్పారు.

---------------------------

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్  ఆజీవిక మిషన్ గ్రామీణ– వీబి –జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణులుకు గతం కంటే మరిన్ని రోజులు ఉపాధి లభిస్తుందని ఇరవై సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. "విబి–జీ రామ్ జీ ", జల్ జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుపై శ్రీకాకుళంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ, విబి–జీ రామ్ జీ పథకం ద్వారా పని దినాలు 100 నుండి 125 కు పెంచడంతో పాటు రైతులకు సకాలంలో కూలీలు అందుబాటులో ఉండడానికి 60 రోజులు మినహాయింపును ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఈ పథకం క్రింద అత్యధిక నిధులు శ్రీకాకుళం జిల్లాకు వచ్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

--------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్  రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ– వీబి –జీ రామ్ జీ  పథకం పట్ల గ్రామీణ ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ పనిదినాలను 100 రోజుల నుండి 125రోజుల పాటు పెంచడాన్ని అనంతపురం జిల్లా  ఉపాధి శ్రామికులు స్వాగతిస్తున్నారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా గుత్తి మండలం అనగానిదొడ్డి గ్రామానికి చెందిన ఉపాధి  శ్రామికులు ఓబులయ్య మాట్లాడుతూ,

వాయిస్ 26 సెకన్లు

--------------------------

జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. 1986 డిసెంబర్ 24వ తేదీన వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో అప్పటినుంచి ప్రతి ఏటా ఈరోజున జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అయితే ప్రస్తుత కాలానికి అనుగుణంగా 1986 నాటి వినియోగదారుల పరిరక్షణ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం –2019ని తీసుకొచ్చింది. ఈ చట్టం వినియోగదారులకు మరింత రక్షణ కల్పిస్తుంది.

=====================